క్లుప్తంగా

'అపార్'ను వేగవంతం చేయండి



అపార్‌పై సమీక్షిస్తున్న ఎంఈఓలు

రేగిడి: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అపార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం వేగవంతం చేయాలని ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య ఆదేశించారు. స్థానిక మండల రిసోర్సు కార్యాలయంలో మంగళవారం సీఆర్‌ఎంటీలు, ఎంఆర్‌సీ సిబ్బందితో సమీక్షించారు. పాఠశాలల వారీగా అపార్ నమోదుపై ఆరాతీశారు. సీఆర్‌ఎంటీలు తమ క్లస్టర్ పరిధిలోని అన్ని పాఠశాలలో ప్రతీ రోజు పర్యవేక్షణ చేసి రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు ఆదినారాయణ, కృష్ణ, మోహనరావు, చంద్రరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతపై ప్రచారం



తునివాడలో త్రైత సిద్ధాతం ప్రచారం చేస్తున్న వేదిక సభ్యులు

రేగిడి: మండలంలో తునివాడ, వన్నలి, ఆమదాలవలస తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాతంపై ప్రచారం నిర్వహించారు. ప్రభోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక శ్రీకాకుళం సభ్యులు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామవీధుల్లో భగవద్గీతపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో సభ్యులు దుర్గారావు, వెంకటరావు, రామకృష్ణ, అప్పన్న, వాసుదేవరావు, లక్ష్మి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన



రైతులతో అపరాల విత్తనాలను శుద్ధి చేయిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: వరికోతలు మొదలవుతున్నందున మినువులు, పెసలు వంటి అపరాల విత్తనాలను రైతుసేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని కోటిపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపరాల విత్తనశుద్ధి విధానాన్ని ఏఓ శిరీష రైతులకు వివరించారు. రబీలో సాగుకు 12 క్వింటాళ్ల మినుములు, పెసర విత్తనాలు తెప్పించామని, మరో 4 క్వింటాళ్ల విత్తనాలు అవసమవుతాయని గుర్తించామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



చెలికానివలసలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని చెలికానివలస, మీసాలడోలపేట గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విధానం, చీడపీడల నివారణ, కషాయాల తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.

పశువుల సంచారంపై నిఘా..

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



క్షేత్ర స్థాయి పర్యటనలో కమిషనర్ నల్లనయ్య, తదితరులు

విజయనగరం: ప్రధాన రహదారులపై విచ్చలవిడి పశు సంచారాన్ని సహించబోమని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద ప్రధాన కాలువలపై పలువురు దుకాణదారులు పలకలు వేయడాన్ని గమనించారు. తక్షణమే ఆ సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శిని పిలిచి వివరణ కోరారు. పలకలు వేయడం వల్ల కాలువలో చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్గంధం వస్తోందని, వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం దాసన్నపేట, తదితర ప్రాంతాల్లో పర్యటించి రహదారులపై పశువుల సంచారాన్ని గమనించారు. పశు పెంపకందారులను పిలిచి తక్షణమే పశువులను ప్రత్యేక ప్రాంతాలకు తరలించాలని, రహదారులపై విడిచిపెడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.



నవదుర్గామాత ఆలయం వద్ద మూసి ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్



వెలవెలబోతున్న అద్దెషాపులు

నాడు ఆదాయ వనరులు..
నేడు నిర్లక్ష్యపు జాడలు

- మూలకు చేరిన మున్సిపల్ కాంప్లెక్స్ సముదాయాలు
- వినియోగంలోకి తేకుండా నిర్లక్ష్యం
- ఆటోస్టాండ్‌గా మార్పు
- అపరిశుభ్రంగా కాంప్లెక్స్ ఆవరణం

రాజాం: అధికారుల నిర్లక్ష్యం కట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వానికి ఆదాయాన్ని తీసుకొచ్చే మార్గాలన్నీ అధికారుల ఉదాసీనతతో ముసుకుపోతున్నాయి. నిన్నమొన్నటివరకూ కళకళలాడే షాపింగ్‌మాల్‌లు ఇప్పుడు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఆవరణం మొత్తం ఆటోస్టాండ్‌గా మారి దుర్గంధం వెదజల్లుతోంది. అటు ఆదాయం కోల్పోయి.. ఇటు ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితి వచ్చింది. ఇదంతా అధికారుల అలసత్వం కారణంగా కనిపిస్తుంది. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పాతబస్టాండ్‌లోని షాపింగ్‌మాల్‌ల పరిస్థితి ఇది.

అద్దె ఆదాయానికి గండి

రాజాంలో నవదుర్గామాత ఆలయం వద్ద ఎనిమిదెకరాల విస్తీర్ణంలో భారీ షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. మొత్తం 18 షాపులతో రెండు షాపింగ్ మాల్స్‌ను ఇక్కడ గతంలో ఏర్పాటుచేశారు. ఆర్‌టీసీ బస్టాండ్ ఇక్కడ ఉన్నంతవరకూ షాపులు కిటకిటలాడేవి. రాజాం మున్సిపల్ కార్యాలయానికి భారీగా అద్దెలు వచ్చేవి. కొత్త ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఏర్పడిన తరువాత ఈ మున్సిపల్ షాపింగ్ మాల్ ప్రాంతం మొత్తం



దుర్గంధ భరితంగా షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణం

వెలవెలబోతోంది. ఆర్‌టీసీ బస్టాండ్ వద్దకే షాపులన్నీ తరలిపోయాయి. ఇక్కడ ఉన్న 18 షాపుల్లో ఒకటి రెండు తప్పా మిగిలినవాటిలో ఎవరూ అద్దెకు ఉండడంలేదు. ఫలితంగా మున్సిపల్ కార్యాలయానికి, ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం మొత్తం క్షీణించింది.

నిధులు కొరత కారణంగానే..

రాజాం మున్సిపల్ కార్యాలయం ఆధీనంలో పలు షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటి నిర్వహణకు నిధుల కొరత వెంటాడుతోంది. దీంతో ఏమిచేయాలో తోచక వాటిని వదిలేశాం. అద్దెలకు వ్యాపారులు ఎవరూ రావడంలేదు. ఖాళీ స్థలాలు దుర్వినియోగం అవుతున్న విషయం వాస్తవమే. వాటిని వినియోగంలోకి తీసుకొస్తాం.

– జె.రామప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్, రాజాం

నిర్లక్ష్యం కారణంగానే..

రాజాం మున్సిపల్ ఆస్తులు, షాపులపై అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారు. నవదుర్గామాత ఆలయం వద్ద ఉన్న షాపులు బాగుచేయడం, ఆ ప్రాంతంలోని 8 ఎకరాల ఖాళీ స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావడంతో అధికారులు విఫలమయ్యారు. ఫలితంగా ఈ ఖాళీ స్థలం ఆటోస్టాండ్‌గా, ప్రైవేట్ వాహనాల పార్కింగ్ ప్రాంతంగా మారిపోయింది. రాత్రి సమయాల్లో పశువులు, గొర్రెలు వంటి మూగజీవాలను ఇక్కడే వదిలేస్తున్నారు. ఉదయాన్నే కూరగాయల మార్కెట్ నిర్వహించి చెత్తచెదారన్ని విచ్చలవిడిగా పడేస్తున్నారు. ఫలితంగా ఈ ప్రాంతం అంతా దుర్గంధం వెదజల్లుతోంది. షాపుల్లో ఉన్నవారంతా ఖాళీ చేశారు. ఈ ఆవరణలోని దుర్గంధం, ప్రైవేట్ వాహనాల పార్కింగ్ కారణంగా ఇక్కడ సత్యన్నారాయణపురం వార్డు సచివాలయానికి ప్రజలు సైతం రావడంలేదు. మరోవైపు ఇదే మున్సిపల్ కార్యాలయంకు సంబంధించి మాధవబజార్‌లో ఉన్న షాపుల్లో కూడా సగానికిపైగా షాపులు ఖాళీగా ఉన్నాయి. షాపులు నిర్వహణలేక శ్లాబ్ ఊడిపోవడంతో అక్కడ అద్దెలకు ఎవరూ ఉండడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ షాపింగ్‌మాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణవాసులు కోరుతున్నారు.

అధికార పార్టీకి కోడ్ వర్తించదా..?



పిట్టాడలో అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీ



మెంటాడలో తొలగించకుండా వదిలేసిన జనసేన ఫ్లెక్సీ

మెంటాడ: జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్చితంగా అమలయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించినా మెంటాడ మండల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు కనిపిస్తున్నా.. వాటిని తొలగించే సాహసం చేయలేకపోతున్నారు. పిట్టాడ గ్రామంలో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు వేసిన అధికారులు ఆ పక్కనే ఉన్న అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలను తొలగించకుండా వదిలేశారు. ఎన్నికల కోడ్ అధికార పార్టీకి ఒకలా, ప్రతిపక్ష పార్టీలకు ఒకలా అమలు చేయడంపై పలువురు మండిపడుతున్నారు.

రూ.2 లక్షలు బీమా సొమ్ము అందజేత



మృతుని భార్యకు రూ.2లక్షలు అందజేస్తున్న ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఆదిత్య

తెర్లాం: పాముకాటుతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా పథకం కింద రూ.2 లక్షలు బీమా సొమ్మును మంగళవారం తెర్లాం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఆదిత్య అందజేశారు. మండలంలోని నందిగాం గ్రామానికి చెందిన పిన్నింటి సూరి గత నెలలో పాముకాటుకు గురై మృతి చెందాడు. మరణించిన వ్యక్తి నందిగాం బీసీ పాయింట్ నిర్వాహకుడు సింహాద్రి ద్వారా ఎస్‌బీఐలో ఏడాదికి రూ.436లు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకున్నాడు. సదరు వ్యక్తి ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై మరణించడంతో పీఎం జీవనజ్యోతి బీమా పథకం కింద రూ.2 లక్షలు మంజూరైయింది. ఈ మేరకు మృతిని భార్య పిన్నింటి నారాయణమ్మకు ఎస్‌బీఐ మేనేజర్ ఆదిత్య పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకంలో చేరడం ద్వారా కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నందన్న అనుపోత్సవం



నందన్న పూజలో పాల్గొన్న భక్తులు

రాజాం: మండలంలోని ఒమ్మి పంచాయతీ కొత్తపేట గ్రామంలో నిర్వహించిన నందన్న ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. 19 రోజులుగా గ్రామంలో అంగరంగ వైభవంగా నందన్న ఉత్సవాలు నిర్వహించారు. అనుపోత్సవంలో భాగంగా గౌరీ సమేత శివపార్వతులు, నందన్న విగ్రహాలను మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య గ్రామవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో గ్రామ పెద్దలు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని ముగడ, డొంకినవలస, గజరాయునివలస, భీమవరం గ్రామాల్లో నందెన్న సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసంలో పౌర్ణమి నాడు నందెన్నలను తీసుకొచ్చి మండపాలపై ప్రతిష్టించి కార్తీక మాసం నాగుల చవితి వరకు పూజలు చేయడం



బాడంగి: డొంకినవలసలో ఎడ్లబండిపై పార్వతీ పరమేశ్వరులు, నందెన్న విగ్రహాల తిరువీధి

ఆనవాయితీ. చవితి రోజు పార్వతీపరమేశ్వరులు, నందెన్న విగ్రహాలను మేళతాళాలతో, డప్పువాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, తీన్‌మార్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంబరాలను తిలకించేందుకు చుట్టుపక్క గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న 104 సిబ్బంది

బాడంగి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 104 వాహన సిబ్బంది వాడాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఇమ్రాన్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా తమకు జీతాలు అందలేదని, కుటుంబ పోషణ కష్టంగా మరిందని వాపోయారు. వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలుచేయాలని కోరారు. డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగుల బీమా చెల్లించాలని, ఉద్యోగులకు యాజమాన్యాల నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని ఉద్యోగులకు న్యాయం చేయలని కోరారు. కార్యక్రమంలో 104 వాహన డ్రైవర్ డి.మురళి, డీఈఓపీ తిరుపతినాయుడు ఉన్నారు.

మోడల్ కోడ్ పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి

బొబ్బిలి రూరల్: స్థానిక సంస్థల కోట ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.శ్రీను అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్, రెవెన్యూ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల ప్రచారాలను నిరోధించడం, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు, సభలు, సమావేశాలపై నియంత్రణ తదితర అంశాలపై సిబ్బంది నిబంధన మేరకు నడుచుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సూపరింటెండెంట్ అప్పారావు, ఎన్నికల డీటీ బలివాడ గౌరీశంకర్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

బాడంగి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ అమలులో ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని తహసీల్దార్ కె.సుధాకర్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పార్టీ నాయకుల విగ్రహాలు, పోస్టర్లపై ముసుగులు, కాగితాలు అంటించామన్నారు. గ్రామాల్లో కోడ్ పక్కాగా అమలయ్యేలా చూడాలని వీఆర్‌ఓలు, కార్యదర్శులకు సూచించారు. పార్టీ సమావేశాలు, ప్రారంభోత్సవాలు, కొత్త పథకాల పంపిణీ వంటివి చేపట్టరాదన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నాగుల చవితి వేడుకను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి గ్రామ పొలిమేరల్లో ఉన్న పుట్టల వద్దకు చేరుకుని నాగదేవతకు పూజలు చేశారు. పుట్టలో పాలు, గుడ్డు, పండ్లు, చలిమిడి ముద్ద వేసి మొక్కులు చెల్లించారు. అనంతరం బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. నిత్యం పొలాల్లో తిరుగాడే రైతులు తమకు ఎలాంటి హాని జరగకుండా ఉండేందుకు ఏటా నాగులచవితి రోజున నాగదేవతలకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

– రాజాం/బొబ్బిలి నెట్‌వర్క్



రాజాం: పెనుబాకలో పుట్ట వద్ద కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తున్న జెడ్పీటీసీ బండి నర్సింహులు



రేగిడి: బూరాడలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



రాజాం సిటీ: కంచరాంలో పుట్ట వద్ద పూజల్లో పాల్గొన్న అయ్యప్పస్వాములు



వంగర: రుషింగిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



సంతకవిటి: అక్కరాపల్లిలో పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు



తెర్లాం: లోచర్లలో పుట్టలో పాలుపోస్తున్న భక్తులు



సంతకవిటి: శంఖరపేటలో పుట్టకు మొక్కుతున్న చిన్నారులు



రాజాం: బొద్దాంలో నాగులచవితి వేడుకలు



బాడంగి: చినభీమవరంలో నాగులచవితి పూజలు



బొబ్బిలి: పాత డంపింగ్ యార్డు వద్ద కృష్ణాపురం వెళ్లే దారిలోని నాగదేవత ఆలయంలో పూజలు చేస్తున్న పురోహితుడు



వంగర: వంగరలో పుట్టవద్ద పూజలు చేసేందుకు వెళుతున్న భక్తులు



తెర్లాం: పెరుమాళి ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో పుట్టలో పాలుపోసి నాగదేవతకు పూజలు చేస్తున్న విద్యార్థినులు



బొబ్బిలి: పాత బొబ్బిలిలో నాగులచవితి వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న భక్తులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



భగవతీ నృత్యకళామందిర్ చిన్నారుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: పట్టణంలోని మూడులాంతర్లు వద్దనున్న పైడితల్లి చదురుగుడి ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ నృత్య కళాకారిణి భగవతీ నృత్యకళామందిర్ వ్యవస్థాపకురాలు వడ్లమాని రమణకుమారి శిష్యబృందం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. అమ్మవారిని కీర్తిస్తూ చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.